భీమవరంలో జంక్షన్ జామ్!

- రహదారిపైనే వాహనాల పార్కింగ్
- ట్రాఫిక్‌తో ఇబ్బందులు

భీమవరం: పట్టణంలో రోడ్లపై అడ్డదిడ్డంగా వాహనాలను పార్కింగ్ చేయడంతో ప్రయాణికులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. సాక్షాత్తు స్థానిక ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు(అంజిబాబు) క్యాంపు కార్యాలయం ఉన్న మల్టీప్లెక్స్ వద్దనే రోడ్డుపైనే వాహనాలు పార్కింగ్ చేస్తున్న పట్టించుకున్న నాథుడే లేరని వాపోతున్నారు. 39 మునిసిపల్ వార్డులతో వన్‌టౌన్, టుటౌన్, త్రీటౌన్‌గా విస్తరించిన భీమవరం పట్టణం విద్య, వైద్య, వ్యాపార కేంద్రంగా అభివృద్ధి చెందింది. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ హాయంలో జిల్లాల పునర్విభజనతో పశ్చిమగోదావరి జిల్లాకు కేంద్రంగా భీమవరం పట్టణం గుర్తింపు తెచ్చుకుంది. నిత్యం వేలాది మంది విద్యార్థులతో కళాశాలలు, పాఠశాలల వాహనాలతో ఉదయం, సాయంత్రం వేలాది వాహనాలు తిరుగుతుంటాయి. ఇది చాలదన్నట్లు తూర్పుగోదావరి, బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, ఏలూరు, కృష్ణా జిల్లాల నుంచి వైద్యం కోసం అనేక వాహనాల్లో వస్తుంటారు. ఆక్వా హబ్‌గా పేరొందడంతో వివిధ అవసరాల కోసం పెద్ద సంఖ్యలో రైతులు వస్తుంటారు. దీంతో వాహనాల రాకపోకలు పెరిగిపోయాయి.


పట్టణంలోని చినవంతెనపై ట్రాఫిక్ జామ్ దృశ్యం (ఫైల్)

● ఇరుకు రోడ్లపైనే వాహనాల పార్కింగ్

పట్టణం అన్నిరంగాల్లో అభివృద్ధి చెందుతున్నా ఆమేరకు రోడ్లు విస్తరణ జరగలేదు. ప్రధాన రహదారుల పక్కనే పెద్ద పెద్ద షోరూమ్స్, ఆసుపత్రులు, హోటల్స్, విద్యాసంస్థలు ఉండడంతో వాహనాలను రోడ్లుపైనే పార్కింగ్ చేస్తుంటారు. పెద్దపెద్ద భవంతులు నిర్మిస్తున్నా వాటికి పార్కింగ్ ప్లేస్ ఉండదు. అయినప్పటికీ మునిసిపల్ టౌన్‌ప్లానింగ్ అధికారులు రాజకీయ వత్తిడి కారణంగా భవనాల నిర్మాణాలకు అనుమతులిస్తుంటారు. రోడ్ల విస్తరణకు ప్రయత్నం చేయకపోవడం రోడ్ల పక్కనే తోపుడు బండ్లు వ్యాపారాలు నిర్వహించడం వల్ల తీవ్ర ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోంది.

విద్యాసంస్థలు, ప్రారంభ, ముగింపు సమయంలో మరీ ఇబ్బంది

ఇరుకురోడ్లు, వాహనాల పార్కింగ్‌తో ఇబ్బందులు పడే ప్రయాణీకులు వివిధ విద్యాసంస్థలు తరగతులు ప్రారంభం సమయంలో ఉదయం 8 గంటల నుంచి 10 గంటల వరకు తిరిగి సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి ఏడు గంటల వరకు విద్యాసంస్థల వాహనాలు అత్యధిక సంఖ్యలో తిరగడంతో ట్రాఫిక్ సమస్య మరింత జఠిలంగా మారుతోంది. అలాగే పెద్ద షాపులకు వస్తువులు, కిరాణా సామగ్రి దిగుమతులు సమయంలో రోడ్డుపైనే పెద్ద పెద్ద వాహనాలు నిలపడం వల్ల మరింత ఇబ్బంది ఏర్పడుతోంది. పట్టణంలోని అనేక ప్రాంతాల్లో ట్రాఫిక్ పోలీసులున్నా ప్రయోజనం అంతంతమాత్రమే.


ఎమ్మెల్యే అంజిబాబు క్యాంపు కార్యాలయానికి వెళ్లే మార్గంలో రోడ్డుపక్కన వాహనాలు పార్కింగ్

మల్టీప్లెక్స్ వద్ద రోడ్డుపైనే వాహనాల పార్కింగ్

టుటౌన్ ఏరియా ఉండి రోడ్డులోని మల్టీప్లెక్స్ వద్దనే ఎమ్మెల్యే అంజిబాబు క్యాంపు కార్యాలయం ఉండడంతో వివిధ అవసరాల కోసం వచ్చే రాజకీయ నాయకులు, ప్రజలు మల్టీప్లెక్స్ ఎదురుగానే ప్రధాన రహదారిపై వాహనాలు నిలిపివేస్తుంటారు. అలాగే మల్టీప్లెక్స్‌లోని వెళ్లే వినియోదారులు అనేక మంది రోడ్డుపైనే పార్కింగ్ చేస్తుంటారు. ఇక్కడ వాహనాలు నిలపరాదనే బోర్డులు తప్ప పార్కింగ్‌ను అడ్డుకునే ధైర్యం పోలీసులు చేయలేకపోతున్నారు. పదిమందికి ఆదర్శంగా నిలవాల్సిన ప్రజాప్రతినిధి క్యాంపు కార్యాలయం వద్దనే అక్రమ పార్కింగ్‌ను ప్రోత్సహిస్తుంటే మిగిలిన ప్రాంతాల్లో ఎవరు అరికడతారని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి కృషి చేయాలని ప్రజలు కోరుతున్నారు.


భీమవరంలోని మల్టీప్లెక్స్ వద్ద రోడ్డుపక్కనే వాహనాలు పార్కింగ్ చేసిన దృశ్యం

మద్యం సీసాలు స్వాధీనం

పాలకోడేరు: అక్రమంగా ఆరు మద్యం సీసాలు కలిగి ఉన్న ఇరగవరపు శ్రీనివాసరావును పాలకోడేరులో అదుపులోకి తీసుకున్నట్టు భీమవరం ప్రొహిబిషన్, ఎక్సైజ్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ బలరామరాజు సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ఎక్కడైనా అక్రమంగా మద్యం నిల్వ చేసి, విక్రయిస్తే తమ దృష్టికి తీసుకురావాలని తెలిపారు. ఈ దాడిలో ఎస్సై ఉమామహేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

గురుకులంలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

పెనుగొండ: స్థానిక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో ఐదో తరగతిలో ప్రవేశానికి ఆన్‌లైన్ దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు ప్రిన్సిపాల్ టి.ఎస్తేర్ క్వీనీ సోమవారం తెలిపారు. మార్చి 6వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఏప్రిల్ 6న ప్రవేశ పరీక్ష ఉంటుందని, పూర్తి వివరాలకు విద్యార్థి స్టడీ సర్టిఫికెట్, ఆధార్ కార్డుతో గురుకుల పాఠశాలలో సంప్రదించవచ్చునని పేర్కొన్నారు.

తాగునీటి సమస్యను పరిష్కరించండి

- ఆవేదన వ్యక్తం చేసిన కౌన్సిలర్లు
- నగర పంచాయతీ సర్వ సభ్య సమావేశం

ఆకివీడు: నగర పంచాయతీ హోదా వచ్చినప్పటికీ ప్రజలకు తాగునీటి ఇక్కట్లు తొలగిపోలేదని పలువురు కౌన్సిలర్లు ఆవేదన వ్యక్తం చేశారు. సమావేశ హాలులో నగర పంచాయతీ చైర్ పర్సన్ జామి హైమావతి అధ్యక్షతన సర్వసభ్య సమావేశం సోమవారం జరిగింది. ఈ సమావేశంలో కౌన్సిలర్ నిమ్మల నాగేశ్వరరావు (నాగు) మాట్లాడుతూ పట్టణ హోదా వచ్చినప్పటికీ ప్రజలకు పంచాయతీ సేవలు కూడా అందడంలేదని వాపోయారు. పట్టణంలో మంచినీటి సమస్య కొన్నేళ్లుగా ఉందని, వాటిని పరిష్కరించాలని ప్రతి సమావేశంలో మొరపెట్టుకున్నా కమిషనర్ పట్టించుకోకపోవడం దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. నాచుతో నీచు కంపు కొడుతున్న నీటిని ప్రజలు తాగాల్సి వస్తోందని బాటిల్‌తో పట్టి తెచ్చిన కలుషితమైన నీటిని కమిషనర్‌కు చూపించారు. దీనివల్ల ప్రజలు అనారోగ్యం పాలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఫిల్టర్ బెడ్లలో ఇసుక మార్చడంలేదని, బ్లీచింగ్, క్లోరినేషన్ చేయడంలేదని వాపోయారు. స్థానికంగా కమిషనర్ నివసించడం లేదని, ఈ నీటిని తాగితే తెలుస్తుందని నాగు ఆరోపించడంతో వెంటనే బాటిల్‌లోని నీటిని కమిషనర్ తాగి చూపించారు. రోజూ ఈ నీటిని తాగడం వల్ల ప్రజలు అనారోగ్యం పాలవుతున్నారని నాగు అన్నారు. పట్టణంలోని మాదివాడ ప్రధాన రోడ్డు పేరును మార్చారని, మోటుపల్లి వారి వీధిగా పంచాయతీ ఏర్పడినప్పటి నుంచి ఉందని, మార్చిన పేరు స్థానంలో మోటుపల్లి వారి వీధి పేరు ఎందుకు తీసుకురావడంలేదని ధ్వజమెత్తారు. వైస్‌చైర్మన్ పుప్పాల పండు మాట్లాడుతూ మంచి నీటి సమస్యపై అన్ని సమావేశాల్లో మొత్తుకుంటున్నారన్నారు. నాన్‌లే అవుట్ భూములు, ఖాళీ ప్రదేశాలకు పన్ను విధించడం ద్వారా ఆదాయం పెరుగుతుందన్నారు. కౌన్సిలర్ జిల్లా పెద్దిరాజు మాట్లాడుతూ తన వార్డులో పైప్‌లైన్ల నిర్మాణం చేపట్టడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కోఆప్షన్ సభ్యులు మన్నే లలితాదేవి మాట్లాడుతూ అమృత పథకంలో పైప్‌లైన్లు ఏర్పాటు చేయాలని సూచించారు. వీటిపై కమిషనర్ మాట్లాడుతూ ఎన్నికల కోడ్ వల్ల టెండర్ల ఖరారు కాలేదన్నారు. అమృత స్కీమ్‌లో పైప్‌లైన్ల విస్తరణ, ట్యాంకుల నిర్మాణ పనులు త్వరలోనే చేపడతామన్నారు. మంచినీటి సమస్య పరిష్కారానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తున్నామన్నారు. తొలుత అజెండాకు తీసుకువచ్చిన 2024–2025 ఆదాయ, వ్యయ పట్టికను సమావేశం ఆమోదించింది. సమావేశంలో వైస్‌చైర్మన్ వంగా జ్యోత్స్న, విప్ పడాల శ్రీనివాసరెడ్డి, కౌన్సిలర్లు పాల్గొన్నారు.


సర్వ సభ్య సమావేశంలో మంచినీటి సమస్యపై ధ్వజమెత్తుతున్న కౌన్సిలర్ నాగేశ్వరరావు

ఆటలతో మానసిక ఒత్తిడి దూరం

ఆకివీడు: అనారోగ్యాన్ని, ఒత్తిళ్లను క్రీడలు దూరం చేస్తాయని ఉప విద్యాశాఖాధికారి ఎస్.రమేష్ చెప్పారు. మండలంలోని సిద్దాపురంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో జోనల్ క్రీడల్ని సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో నైపుణ్యం సాధించాలని పిలుపునిచ్చారు. శరీరక ధారుఢ్యానికి క్రీడలు దోహదపడతాయన్నారు. మానసికోల్లాసానికి క్రీడలు తోడ్పడతాయన్నారు. క్రీడల ద్వారా క్రమశిక్షణ కలిగిన విద్యార్థులు, తదనంతరం సమాజానికి ఉత్తమ పౌరులుగా ఎదుగుతారని చెప్పారు. నియోజకవర్గంలోని అన్ని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లోని విద్యార్థులు క్రీడా పోటీల్లో పాల్గొంటారని ఎంఈఓ ఏ.రవీంద్ర చెప్పారు. క్రీడాకారులకు ఆయా విభాగాల్లో పోటీలను జోనల్ క్రీడా పోటీల నిర్వాహకులు, పీఈటీ జీ.మోహన్ ఆధ్వర్యంలో నిర్వహించారు.గేమ్స్, అథ్లెటిక్స్ పోటీల జాబితాను ప్రకటించారు. రెండు రోజుల పాటు పోటీలు కొనసాగుతాయని చెప్పారు. సమావేశంలో ఉపాధ్యాయులు, పీఈటీలు, పీడీలు పాల్గొన్నారు.


నియోజకవర్గస్థాయి జోనల్ క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న డీవైఈఓ ఎస్.రమేష్

బొర్రా లక్ష్మణ్‌ను పరామర్శించిన పీవీఎల్

పాలకోడేరు: ఇటీవల రోడ్డు ప్రమాదంలో కుమారుడిని కోల్పోయిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త బొర్రా లక్ష్మణ్‌ను పార్టీ ఉండి నియోజవర్గం ఇన్‌చార్జి పీవీఎల్ నరసింహరాజు సోమవారం విస్సాకోడేరు వెళ్లి పరామర్శించారు. భీమవరంలో ఇటీవల రోడ్డు పక్కన నిలబడి ఉన్న ఈశ్వర్ (11)ను ట్రాక్టర్ ఢీ కొట్టడంతో అతడు తీవ్ర గాయాలపాలై విజయవాడ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. కుమారుడు మరణించడంతో లక్ష్మణ్ తీవ్ర దుఃఖంలో మునిగిపోయారు. ఈ సందర్భంగా పీవీఎల్ మాట్లాడుతూ చిన్న వయస్సులోనే ఈశ్వర్ మృతి చెందడం చాలా బాధాకరమని, అతని లోటు తీర్చలేనిదని అన్నారు. సర్పంచ్ బొల్లా శ్రీనివాస్, ఉప సర్పంచ్ కందుల నాగరాజు, మాజీ సర్పంచ్ పెన్మత్స శ్రీనివాసరాజు, దుండి అశోక్ బాబు, సొసైటీ మాజీ చైర్మన్ గెద్దం జోషి, కొండపల్లి శ్రీను, ఆరేపల్లి శ్రీను, సూరగాని పాపారావు, మండల పరిషత్ కోఆప్షన్ సభ్యురాలు డాక్టర్ డి ఆర్ స్వర్ణలత, పెనుమాల రిచి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.


విస్సాకోడేరులో బొర్రా లక్ష్మణ్ కుటుంబాన్ని పరామర్శిస్తున్న పీవీఎల్ నరసింహరాజు

విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి



భీమవరంలో సెంట్రల్ ఎక్సైజ్ దినోత్సవం సందర్భంగా ప్రతిజ్ఞ చేస్తున్న దృశ్యం

భీమవరం: దేశ ఆర్థిక వ్యవస్థలో సెంట్రల్ ఎక్సైజ్‌శాఖ కీలక పాత్ర పోషిస్తుందని భీమవరం ఎక్సైజ్ సీఐ కె బలరామరాజు అన్నారు. సోమవారం శ్రీవిజ్ఞానవేదిక, డీఎన్నార్ ఎన్‌సీసీ, ఆర్‌ఆర్‌డీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థుల ఆధ్వర్యంలో సెంట్రల్ ఎక్సైజ్ దినోత్సవాన్ని పురస్కరించుకుని మాదక ద్రవ్యాల నిషేధంపై అవగాహన ర్యాలీ, ప్రతిజ్ఞ నిర్వహించారు. డీఎన్నారు కళాశాల ఎన్‌సీసీ మేజర్ ఎ వీరయ్య, ఎన్ఎస్ఎస్ అధికారి కె శ్రీనివాసరావు మాట్లాడుతూ యువత మద్యం మత్తులో పడి బంగారు భవిష్యత్‌ను నాశనం చేసుకుంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. నిర్వాహకుడు చెరుకువాడ రంగసాయి విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ఎక్సైజ్ శాఖ కార్యాలయం నుంచి శ్రీరాంపురం, రాయలం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ శాఖ ఎస్సైలు పీవీవీఎస్ ఉమామహేశ్వరరావు, పి సునీల్‌కుమార్, ఏం షరీఫ్, బి తాతా రాజు, ఆర్ వాణిశ్రీ విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై రైతులు దృష్టి సారించాలి

ఉండి: రైతులు ప్రకృతి వ్యవసాయంపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని కేవీకే శాస్త్రవేత్తలు తెలిపారు.సోమవారం ఎన్నార్పీ అగ్రహారంలోని కృషి విజ్ఞాన కేంద్రంలో ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి 6వ వార్షికోత్సవం, రైతు సమ్మాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాని నరేంద్రమోదీ పీఎం కిసాన్ సమ్మాన్ నిధి పథకం 19వ విడత నిధులు విడుదల య్యాయని తెలిపారు. ప్రధాని ప్రసంగాన్ని కేవీకేలో రైతులకు ప్రత్యక్ష ప్రసారంలో వినిపించారు. అనంతరం కార్యక్రమానికి హాజరైన రైతులు,ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘ సభ్యులకు ప్రకృతి వ్యవసాయం, దాని ఆవశ్యకతపై ప్రత్యేక శిక్షణ, అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రకృతి వ్యవసాయంతో రైతులకు ఆదాయం సమకూరుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు డాక్టర్ ఏ శ్రీనివాసరావు, డాక్టర్ పీ వినయలక్ష్మి, రైతులు, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘ సభ్యులు పాల్గొన్నారు.


కేవీకేలో ప్రకృతి వ్యవసాయ విధానాలను రైతులకు వివరిస్తున్న శాస్త్రవేత్తలు

హరహర మహాదేవ

- కోరిన కోర్కెలు తీర్చే సకల సుందరేశ్వరస్వామి
- శివరాత్రి ఉత్సవాలకు ప్రత్యేక ఏర్పాట్లు

వీరవాసరం: కోరిన కోర్కెలు తీర్చే స్వామిగా సకల సుందరేశ్వరస్వామివారు భక్తుల పూజలందుకుంటున్నారు. పురాణ చరిత్ర కలగిన సకల సుందరేశ్వరస్వామిని దర్శించుకొనేందుకు మహాశివరాత్రి పర్వదినాన వేలాది మంది భక్తులు తరలివస్తుంటారు. బుధవారం మహాశివరాత్రి సందర్భంగా వీరవాసరంలో మండలం రాయకుదురులో సకల సుందరేశ్వరస్వామి ఆలయం వద్ద విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. సకల సుందరేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని ఈనెల 26వ తేదీ ఉదయం 6 గంటల నుంచి ప్రత్యేక అభిషేకాలు, హోమాలు నిర్వహించడం జరుగుతుందని, సాయంత్రం వీరభద్రేశ్వర స్వామి వారి అచ్చరబ కార్యక్రమం, పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలతో పాటు లింగాకారం సెంటర్లో వేంచేసి ఉన్న శ్రీ సకల సుందరేశ్వరస్వామి వారి ఆలయం నుండి బజార్ సెంటర్లో వేయించేసి ఉన్న శ్రీ ఉమామూలేశ్వర స్వామి వారి ఆలయం వరకు రోడ్డుకు ఇరువైపులా దీపాలను పెట్టి అఖండ దీపోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.



రాయకుదురు లింగాకారం సెంటర్లో కొలువైన స్వయంభు సకల సుందరేశ్వరస్వామి శిలాశాసనం

ప్ర‘జల’ కష్టాలు!

- 13వ వార్డులో పారిశుద్ధ్యం అధ్వానం
- మున్సిపల్ కమిషనర్‌కు ఫిర్యాదు చేసిన మహిళలు

భీమవరం(ప్రకాశం చౌక్): పట్టణంలో మంచినీటి సమస్య, పారిశుద్ధ్య సమస్యలతో పట్టణ ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. 13 వార్డులో మంచినీటి సమస్య, పారిశుద్ధ్య సమస్యతో వార్డు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నెలనెల తరబడి సమస్యలతో బాధపడుతున్నారు. 13 వార్డుకు చెందిన పలువురు మహిళలు భీమరం మున్సిపల్ కమిషనర్‌కు సోమవారం తమ సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు మహిళలు మాట్లాడుతూ తమ వార్డులో మంచినీటి సమస్య ఉందని, ట్యాంకర్లు ద్వారా మంచినీటి సరఫరా చేయాలని కోరారు. పారిశుద్ధ్యం కూడా అధ్వానంగా ఉందని తెలిపారు. దోమలు విజృంభిస్తున్నాయని తెలిపారు. కమిషనర్ అందుబాటులో లేకపోవడంతో ఇతర మున్సిపల్ అధికారులకు వినతి పత్రం అందజేశారు.


కమిషనర్‌కు మంచినీరు, పారిశుద్ధ్య సమస్యను విన్నవించేందుకు మున్సిపాలిటీకి వచ్చిన మహిళలు

మంచినీటి సమస్యను పరిష్కరించండి

మా వార్డులో గత నాలుగు నెలలగా మంచినీటి సమస్య ఉంది. మంచినీళ్ల కోసం ఇబ్బందులు పడుతున్నాము. ట్యాంకర్లు ద్వారా మంచినీళ్ల సరఫరా సక్రమంగా లేదు. బయట నుంచి నీళ్లు తెచ్చుకునే పరిస్థితి ఉంది. మంచినీరు సక్రమంగా అందజేసేలా చర్యలు చేపట్టాలని మున్సిపల్ అధికారులను వేడుకుంటున్నాం.


వి.నాగలక్ష్మి 13 వార్డు

చెత్త, చెదారంతో ఇబ్బందులు

వార్డులో మంచినీటి సమస్యతో పాటు చెత్త, చెదారం సమస్యతో కూడా ఇబ్బందులు పడుతున్నాము. వార్డులు పారిశుద్ధ్యం అధ్వానంగా ఉండడంతో దోమలు విజృంభిస్తున్నాయి. డ్రెయిన్లు బాగు చేయాలని మున్సిపల్ అధికారులను కోరుతున్నాం.


తోట పద్మ 13 వార్డు

క్లుప్తంగా

ఆర్థిక ప్రణాళికతోనే వృద్ధి సాధ్యం

ఆకివీడు: ఆర్థిక ప్రణాళికతోనే కుటుంబాలు ప్రగతి సాధిస్తాయని యూనియన్ బ్యాంక్ మేనేజర్ వి.విక్టర్ బాబు చెప్పారు. మండలంలోని దుంపగడప గ్రామంలో ఎస్ఎస్ఐ సంస్థ ఆధ్వర్యంలో ఆర్‌బీఐ ఆదేశాల మేరకు అవగాహన సదస్సు సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు ఆర్థిక ప్రగతిపై దృష్టి కేంద్రీకరించాలని సూచించారు. అనంతరం స్త్రీల శ్రేయస్సు అంశంపై కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డీసీ అనిల్, ఎరిచర్ల గ్లాడ్‌సన్, బెల్‌షాజర్, వీడీఏ మల్లేశ్వరి, మహిళలు పాల్గొన్నారు.

వ్యక్తికి రూ. 10 వేలు జరిమానా

భీమవరం: భీమవరం వన్‌టౌన్ పోలీసుస్టేషన్ పరిధిలో మద్యం సేవించి వాహనం నడిపిన కేసులో పట్టణానికి చెందిన పెచ్చేటి సింహాద్రి అప్పారావుకు రూ. 10 వేలు జరిమానా విధించినట్లు వన్‌టౌన్ సీఐ ఎం నాగరాజు సోమవారం చెప్పారు. నిందితుడు అప్పారావును భీమవరం స్పెషల్ జ్యూడిషల్ సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టులో హాజరు పర్చగా స్పెషల్ జ్యూడిషల్ సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ ఎం వీఎస్ రాజారావు పై మొత్తాన్ని జరిమానా విధించారన్నారని నాగరాజు తెలిపారు.

రామ్మూర్తికి సత్కారం

కాళ్ల: సౌత్ సెంట్రల్ రైల్వే సికింద్రాబాద్ – జోనల్ రైల్వే యూజర్స్ కన్సల్టేటివ్ కమిటీ (జెడ్ఆర్‌యూసీసీ) సభ్యుడిగా ఎంపికైన కోరా రామ్మూర్తిని కూటమి శ్రేణులు సత్కరించారు. కాళ్ల మండలం పెదఅమీరం పంచాయతీ కార్యాలయం వద్ద సోమవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ డొక్కు సోమేశ్వరరావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో కష్టపడి పనిచేసిన ప్రతి ఒక్కరికీ సముచిత స్థానం ఉంటుందన్నారు. తమ గ్రామానికి చెందిన రామ్మూర్తి ప్రతిష్టాత్మక జెడ్ఆర్‌యూసీసీ సభ్యుడిగా ఎంపికవ్వడం శుభపరిణామమన్నారు. అనంతరం రామ్మూర్తిని పూలమాలలు, దుశ్శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో బూరాడ వెంకటకృష్ణ, డొక్కు యాగవేంద్రరావు, నడింపల్లి సుబ్బరాజు, జాషువా, ప్రసాద్, కిషోర్, పలువురు వార్డు మెంబర్లు, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గోదావరి గట్టు రెయిలింగ్ ధ్వంసం


రేవును శుభ్రం చేస్తున్న సిబ్బంది

నరసాపురం: పట్టణంలో గోదావరి గట్టు వెంబడి పాలరాయితో నిర్మించిన రెయిలింగ్ ధ్వంసమైంది. దీనిని 2015 గోదావరి పుష్కరాల సమయంలో గట్టు వెంబడి నిర్మించారు. అయితే పర్యవేక్షణ లేకపోవడంతో రెయిలింగ్ ధ్వంసమైంది. గట్టు వెంబడి నిర్మించిన ఫుట్‌పాత్ కూడా ధ్వంసమైంది. వెంటనే మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

స్కూల్ గేమ్స్ ప్రారంభం

పెనుమంట్ర: ఆచంట నియోజకవర్గం పరిధిలో గ్రిల్ స్పోర్ట్స్, గేమ్స్ సోమవారం మార్టేరులోని వేణుగోపాల ఉన్నత పాఠశాల ఆవరణలో ప్రారంభించారు. ఆరు నుంచి తొమ్మిదో తరగతి వరకు చదివే విద్యార్థులకు వాలీబాల్ కబడ్డీ, ఖోఖో, త్రోబాల్ క్రీడల్లో 100 మీటర్లు, 200 మీటర్లు, 400 మీటర్ల పరుగు పందాలతో పాటు డిస్కస్‌త్రో, షార్ట్‌పుట్, లాంగ్‌జంప్ పోటీలు నిర్వహించామని స్పోర్ట్స్ ఆర్గనైజింగ్ కార్యదర్శి పడాల శ్రీనివాసరెడ్డి తెలిపారు.

నేత్రపర్వంగా సత్యదేవుని వత్రాలు


స్వామి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

అత్తిలి: మాఘమాసం ఏకాదశి పర్వదినం సందర్భంగా జిల్లాలో బులి తిరుపతిగా పేరుగాంచిన అత్తిలి మండలం ఈడూరు గ్రామంలో వరాల వెంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో సోమవారం సామూహిక సత్యనారాయణ వత్రాలు, శ్రీనివాస కల్యాణ మహోత్సవాలు కనులపండువగా జరిగాయి. ఉదయం స్వామి వారిని పుష్పాలతో అలంకరించిన వాహనంపై ఉంచి మేళతాళాల నడుమ గ్రామోత్సవాన్ని నిర్వహించారు. అనంతరం స్వామివారి ఆలయ ప్రాంగణంలో సామూహిక సత్యనారాయణ వత్ర పూజలు జరిగాయి. గ్రామానికి చెందిన మాజీ చైర్మన్ ప్రభాకర కోటిరామలింగరాజు దంపతులతో పాటు 130 మంది దంపతులు సత్యదేవుని వ్రతాలను ఆచరించారు. అర్చకులు వాడపల్లి శేఖరాచార్యులు, వాడపల్లి విఖన్‌బాబు ఆధ్వర్యంలో చానమిల్లికి చెందిన నరశింహాచార్యులు వేదపండితుల మంత్రోచ్చారణ నడుమ సత్యదేవుని వత్రాలు, శ్రీనివాస కల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. భీమవరానికి చెందిన వారణాసి లక్ష్మీ నరసింహశాస్త్రి కల్యాణోత్సవం, సత్యదేవుని వత్రాలకు వ్యా ఖ్యాతగా వ్యవహరించారు. సత్యానారాయణ స్వామి వత్రాలు, శ్రీనివాస కల్యాణోత్సవాన్ని భక్తులు తిలకించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

భీమవరం: భీమవరం పట్టణం ఏఎస్ఆర్ నగర్‌లోని 33/11కె వి ఇండోర్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో 11 కెవి చిన అమిరం ఫీడర్‌పై చెట్లు, కొమ్మలు తొలగిండం, లైన్ల మరమ్మతులు కారణంగా మంగళవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఎలక్ట్రికల్ ఈఈ ఎస్ వెంకటేశ్వరరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు రాయలం బైపాస్ రోడ్ ఏరియాలోని కొన్ని ప్రాంతాలు, చిన అమిరం గ్రామానికి పూర్తిగా విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆయన తెలిపారు. వినియోగదారులు సహకరించాలని వెంకటేశ్వరరావు కోరారు.

రేషన్ బియ్యం అక్రమ నిల్వపై కేసు నమోదు

ఆకివీడు: రేషన్ బియ్యం అక్రమంగా నిల్వ చేసిన స్థానిక సిద్ధాపురం రోడ్డులోని షణ్ముఖ రైస్ ట్రేడర్స్ యజమాని దాసరి శ్రీనివాసరావుపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై హనుమంతు నాగరాజు సోమవారం చెప్పారు. ఈ నెల 5న షాపులో రేషన్ బియ్యాన్ని అక్రమంగా నిల్వ చేయడంతో దాడి చేసినట్టు సివిల్ సప్లయ్ డిప్యూటీ తహసీల్దార్ మహేశ్వరరావు తెలిపారు. ఈ దాడిలో 3,150 కిలోల బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారని, షాపు యజమాని శ్రీనివాసరావుపై ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

అధ్వానంగా ఏటిగట్టు లైటింగ్

నరసాపురం : నరసాపురం గోదావరి ఏటిగట్టు పొడవునా వీధిలైట్ల పరిస్థితి అధ్వానంగా ఉంది. లైట్లు సవ్యంగా వెలగడం లేదు. పోయిన లైట్లు మునిసిపల్ అధికారులు పునరుద్ధరించడంలేదు. వలందరరేవు, లలితాంబ ఘాట్ వద్ద, పడవల రేవు తప్పిస్తే ఏటిగట్టు పొడవునా వీధి లైట్లు వెలగడం లేదు. నిత్యం ఏటిగట్టు ప్రాంతానికి సాయంత్రం వేళల్లో పట్టణ వాసులు పెద్ద సంఖ్యలో షికారుకు వస్తారు. లైట్లు వెలగకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

ప్రమాదకరంగా వంతెన మార్గం


వంతెన మార్గంలో పైకి లేచిన రాళ్లు

నరసాపురం: పట్టణంలోని రుస్తుంబాదలో మంగళగుంటపాలెంకు వెళ్లే వంతెన మార్గం ప్రమాదకరంగా మారింది. వంతెన ఎక్కే మార్గంలో అటూ ఇటూ కూడా రాళ్లు పైకిలేచి పోయాయి. రోడ్డు శిథిలమైంది. దీంతో వాహనచోదకులు ప్రమాదాలకు గురువుతున్నారు. సైకిళ్లపై వెళ్లే స్కూల్ విద్యార్థులు తరచూ ప్రమాదాలకు గురవుతున్నారు. సంబంధిత అధికారులు చర్యలు తీసుకొని పరిస్థితిని చక్కదిద్దాలని స్థానికులు కోరుతున్నారు.

స్నానాలకు వీలుగా కేదారీ ఘాట్

పెనుగొండ : మహాశివరాత్రి పుణ్యస్నానాలకు ఇబ్బందులు లేకుండా వశిష్టా గోదావరి సిద్ధాంతం కేదారీఘాట్‌లను పంచాయతీ ఆధ్వర్యంలో శుభ్రపరిచారు. సోమవారం సర్పంచ్ చింతపల్లి గనిరాజు (చంటి) పర్యవేక్షణలో పంచాయితీ సిబ్బంది శుభ్రం చేశారు. భక్తులు స్నానాల చేయటానికి వీలుగా రేవుల్లో ఉన్న సీసా పెంకులు, చిరిగిపోయిన దుస్తులను తొలగించారు. సర్పంచ్ చంటి మాట్లాడుతూ స్నానాలు చేయడానికి వచ్చే భక్తులు రేవుల్లో శుభ్రత పాటించి అధికారులకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో కార్యదర్శి కిషోర్ బాబు పాల్గొన్నారు.